

నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోండి

జంగారెడ్డిగూడెం:ప్రయివేటు విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న బస్సులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రవాణా శాఖ అధికారి ఎమ్‌డి మదనికి డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిని అందించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ పట్టణంలో ప్రయివేటు విద్యాసంస్థల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కాలంచెల్లిన బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను అధిక సంఖ్యలో రవాణా చేయడాన్ని అరికట్టాలని కోరారు. ఒక్కొక్క విద్యార్థి నుండి నెలకు బస్సు ఫీజు రూ.1500 నుండి రూ.రెండు వేల వరకూ వసూలు చేస్తున్న యాజమాన్యం పిల్లలను ఇరుకుగా కూర్చోపెట్టి నడుపుతున్నారని విమర్శించారు. కనీసం క్లీనర్ లేకుండా నిర్లక్ష్యంగా బస్సులను నడుపుతున్న యాజమన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఎన్.రాజేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు బి.యశ్వంత్ పాల్గొన్నారు.

తిలకం దిద్ది, హారతులిస్తూ..

సిపిఎం మహాపాదయాత్రకు ఘన స్వాగతాలు

ప్రజాశక్తి-ఎటపాక, చింతూరు

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో మంగళవారం ప్రారంభమైన పోరుకేక మహాపాదయాత్రకు నిర్వాసిత గ్రామల్లో ప్రజలు తిలకం దిద్ది, హారతులిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ పాదయాత్రను ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో మంగళవారం అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ జెండా ఊపి ప్రారంభించారు. నిర్వాసితులు పూలమాలలు వేసి పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. కళాకారులు, కార్యకర్తలకు, నిర్వాసితులకు అల్పాహారం, తాగునీరు కల్పించారు. పాదయాత్రకు అగ్రభాగాన కళాకారులు ప్రదర్శించిన గిరిజన సంప్రదాయ డోలు కొమ్ము రేల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నెల్లిపాకలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిపిఎం శ్రేణులు, నిర్వాసితులు ట్రాక్టర్లలోనూ, మ్యాజిక్ ఆటోల్లోనూ, మోటార్ బైకులపైనా వందలాదిగా తరలివచ్చారు. ఎర్రని ఎండను సైతం లెక్కచేయకుండా ఎర్రజెండాలతో పాదయాత్రలో పాల్గొన్నారు. దీంతో నెల్లిపాక ప్రధాన కూడలి ఎరుపెక్కింది. బహిరంగ సభ అనంతరం ప్రారంభమైన పాదయాత్ర బ్లేడ్లపేట చేరుకుంది. అక్కడ మధ్యాహ్నం భోజనం అనంతరం ప్రారంభమైన పాదయాత్ర గన్నవరం, గౌరిదేవిపేట, నందిగామ మీదుగా మురుమూరు వరకు సాగింది. గన్నవరం గ్రామంలో సిపిఐ నాయకులు పాదయాత్ర బృందానికి పూలమాలవేసి స్వాగతం పలికారు. అనంతరం పోలవరం ఉద్యమకారుడు, రైతు సంఘం నాయకుడు కందుల శ్రీనివాస్ స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ పాదయాత్రలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, ఎపి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా నాయకులు బలరాం, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, మహిళా సంఘం రాష్ట్ర నాయకులు కుంజా రాధ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, లోత రామారావు, మోడం నాగయ్య, వి.ఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి రామ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్న, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లవు వెంకట్, కూనవరం నాయకులు మేకల నాగేశ్వరరావు, చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్, ఎటపాక మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ పంచాయతీ తీర్మానం అందజేత

సిపిఎం మహా పాదయాత్ర బృంద నాయకుడైన రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు ఎటపాక మండలం నందిగామ పంచాయతీ గ్రామ సభ తీర్మానాన్ని అందజేశారు. 2022 గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకొని నందిగామ పంచాయతీలోని నందిగామ, నందిగామపాడు గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చి పునరావాసం కల్పించాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ మేరకు గతంలో రూ.1.15లక్షలు పరిహారం ఇచ్చిన భూములకు రూ.5లక్షలు చెల్లించాలని, రాబోయే గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు నిత్యవసర సరుకులు, టార్పాలిన్లు, కిరోసిన్/సోలార్ లాంతర్ తదితరాలు సిద్ధం చేసి ఉంచాలని పంచాయతీ చేసిన గ్రామసభ తీర్మానాన్ని గ్రామ ప్రజలు శ్రీనివాసరావుకి అందించారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయండి : విఎస్ఆర్

ఎటపాక : పాదయాత్ర సందర్భంగా నందిగామలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది జులైలో వరదల కారణంగా నందిగామ గ్రామం పూర్తిగా మునిగినా నష్ట పరిహారం చెల్లించలేదని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై 3గంటల పాటు రాస్తారోకో చేసారని, అందులో తను కూడా పాల్గొన్నానని గుర్తు చేశారు. కానీ నేటికీ ఈ గ్రామానికి వరద నష్ట పరిహారం చెల్లించలేదని, 41.15 కాంటూరులో చేర్చలేదని పేర్కొన్నారు. మాట తప్పం.. మడమ తిప్పం అనే జగన్ గతంలో రైతులకు రూ.1.15లక్షలు ఇచ్చిన రైతులకు రూ.5లక్షలు ఇస్తామని వాగ్దానం చేసిన హామీ ఏమైందని ప్రశ్నించారు. 4సంవత్సరాలు గడిచినా ఇచ్చిన మాట నెరవేర్చక పోవడం మడమ తిప్పడం కాదా అని ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులు పరిహారం పునరావాసం అడుగుతుంటే వినిపించడం లేదా అన్నారు. తాడేపల్లి పాలస్‌లో పడుకున్నావా అంటూ మండిపడ్డారు. పోలవరం నిర్వసితులందరికీ ఒకే సారి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.


పాదయాత్ర బృందానికి తిలకం దిద్ది హారతులిస్తున్న మహిళలు


ప్రతిజ్ఞ చేయిస్తున్న వి.శ్రీనివాసరావు

పాదయాత్రకు వందలాదిగా కదిలిన జనం

విఆర్.పురం :పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన ఎటపాక మండలం నెల్లిపాకలో మంగళవారం ప్రారంభమైన మహాపాదయాత్రకు విఆర్.పురం మండలం నుండి నిర్వాసితులు, సిపిఎం శ్రేణులు భారీగా తరలివెళ్లారు. రేఖపల్లిలో ఎంపిపి కారం లక్ష్మి, మాజీ ఎంపిపి సున్నం నాగమ్మ, మాజీ ఎమ్మెల్యేఎ సతీమణి సున్నం చుక్కమ్మ ఎర్ర జెండా ఊపి ప్రారంభించారు. అక్కడ నుండి వాహనాల్లో వందలాది మంది నెల్లిపాక బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పంప సత్తిబాబు, పులి సంతోష్ కుమార్, పూనం ప్రదీప్ కుమార్, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం నాయకులు కారం సుందరయ్య, సోడి మల్లయ్య, పోడియం శ్రీరామ్మూర్తి, ప్రకాష్, సత్యనారాయణ, సుధీర్, హజరత్, కన్నయ్య, వీర్ల నాగేశ్వరరావు నాయకత్వం వహించారు.


వర్షంలోనూ సాగుతున్న పాదయాత్ర


బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్

ముంపు బాధితులకు జరగని న్యాయం

కూనవరం : పోలవరం ప్రాజెక్ట్ ముంపు వల్ల నష్టపోతున్న ప్రజలకు సరైన న్యాయం జరగడం లేదు. ప్రతిఏటా ముంపు ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది వచ్చే వరదలకు కూనవరం, ఎటపాక, విఆర్.పురం, చింతూరు 4 మండలాల్లో అనేక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. కట్టు బట్టలతో రోడ్డున పడుతున్నారు. అన్ని గృహోపకరణ వస్తువులను గోదారమ్మకు వదిలేసి బతుకు జీవుడా అని ఎత్తయిన ప్రాంతాలలో తల దాచుకుంటున్న పరిస్థితి. అటు వరద వచ్చి ఇబ్బంది పడ్డ ప్రజలు వరద తగ్గాక కూడా ఇళ్లలో బురద పేరుకు పోయి ఒక్క ఇంటిని శుభ్రం చేయడానికి రూ.20వేలు నుండి రూ.40 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీనికి తోడు పంటలు ఆలస్యంగా వేయాల్సి వస్తోంది. ముంపు మండలాలలో అత్యధికంగా వేసే మిర్చి, పొగాకు లాంటి వాణిజ్య పంటలు వరదల వల్ల 3 నెలలు ఆలస్యంగా వేయాల్సి వస్తోంది. దీంతో దిగుబడి రాక రైతులు అప్పుల పాలవుతున్నారు. గతేడాది వరదలు సమయంలో ముఖ్యమంత్రి ఇస్తానన్న రూ.10వేలు ఆర్థిక సాయం కూడా నేటికీ అందని పరిస్థితి ఉంది. మరో వైపు కాంటూరు 41 అడుగుల లెక్కలు చెబుతూ పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా ప్రభుత్వాలు కాలం వెల్లదీస్తున్నాయి. గతేడాది వచ్చిన వరదలకు మొత్తం మునిగిపోవడంతో కాంటూరు లెక్కలు పెద్ద బూటకమని ప్రకృతి సైతం తేల్చింది. అటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడం లేదు. నష్టపరిహారం ఇవ్వడం లేదు. పునరావాసం కల్పించడం లేదు. ముంపు మండలాలు రోజులు తరబడి నీటిలో మునిగితే చూసే నాథుడే కరువైయ్యారు. కనీసం నిత్యావసరాలు కూడా సరిగా ఇవ్వలేదన్నది సగటు ముంపు బాధితుల ఆవేదన. ఈ విధంగా ప్రత్యక్షంగా పరోక్షంగా ముంపు ప్రజలకు అన్యాయం జరుగుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిని గాలికొదిలేశాయి.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - నిడమర్రు

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని బువ్వనపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పార్టీ మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన సిఎం జగన్ నాలుగేళ్లలో ఏడుసార్లు విద్యుత్ రేట్లు పెంచారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్ల విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకుతీసుకురావడం అన్యాయమన్నారు. ట్రూ అప్, ఇంధనఛార్జీల పేరుతో అదనపు వసూలును విరమించుకోవాలన్నారు. భువనపల్లి ఇందిరమ్మ కాలనీలో హై ఓల్టేజీ, లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతుంటే వేళాపాళా లేని విద్యుత్ కోతలు మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిలి నాని, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, రోకల రెడ్డి, అలుమోలు చంటి, మిందీ బాపిరాజు, వెలగలేటి మోహన్ పాల్గొన్నారు.



డ్వామా అధికారుల అవినీతిపై చర్యలు తీసుకోండి


ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధి హామీ కూలీల సమస్యలు పట్టించుకోకుండా సోషల్ ఆడిట్ అధికారులతో మంతనాలు జరుపుతూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న డ్వామా అధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో వ్యవసాయ కార్మిక సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంటే కిందిస్థాయిలో ఈ చట్టంలో అనేక అవకతవకలు చేసి అధికారులు ఈ చట్టాన్ని నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీలో సోషల్ ఆడిట్ జరుగుతున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సోషల్ ఆడిట్ సిబ్బందితో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. ఇలాంటి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఉపాధి హామీ పని జరుగుతున్న చెరువుల్లో ఇరిగేషన్ అధికారులు లేదా ఎంపిడిఒ అనుమతితో మట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం బృందం పర్యటించిన సందర్భంలో అనేక మండలాల్లో తేటతెల్లమైందన్నారు. దీనిపై పలుమార్లు జిల్లా డ్వామా అధికారుల దృష్టిలో పెట్టిన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఈ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పని జరుగుతున్న చెరువుల్లో ఇరిగేషన్ అధికారులు మట్టి తవ్వటానికి ఏ విధంగా అనుమతులుస్తున్నారని ప్రశ్నించారు. ఉపాధి పనులు చేసే ప్రాంతంలోనే ఇరిగేషన్ అధికారులు ఇలా ఇవ్వడం వల్ల పనిచేసే కూలీలకు నష్టదాయకమన్నారు. అధికార పార్టీ నాయకుల అండదండతో మట్టి అక్రమ రవాణా రోజురోజుకూ పెరుగుతుందని తెలిపారు. ద్వారకాతిరుమల, పెదవేగి, నూజివీడు, దెందులూరు, జంగారెడ్డిగూడెం మండలాల్లో మట్టి అక్రమ రవాణా రోజురోజుకు పెరుగుతుందని ఇది మండల స్థాయి అధికారులకు, రాజకీయ నాయకుల ప్రలోభాలతో పేదప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెదవేగి, దెందులూరు, ద్వారకాతిరుమల ప్రాంతాల్లో నేటికీ మట్టి రవాణా విచ్చలవిడిగా జరుగుతుందని దీనిపై వెంటనే దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. పెదవేగి, ముసునూరు, భీమడోలు, నిడమర్రు గ్రామాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని మండిపడ్డారు. డబ్బులిస్తేనే మస్టర్ వేసే పద్ధతిని ఆపాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యలపై జంగారెడ్డిగూడెం, దెందులూరు, పెదవేగి, లింగపాలెం, ఉంగుటూరు, నిడమర్రు, ద్వారకాతిరుమల, ముసునూరు, చాట్రాయి, ముదినేపల్లి, కైకలూరు మండలాల ఎపిఒలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టి.ముత్యాలమ్మ, టి.సత్యనారాయణ, ఎస్.మహంకాళి, రాజమండ్రి ధానియేలు, ఎం.సుధారాణి, పి.మురళీ పాల్గొన్నారు.


పోలవరంలో పడుతున్న తొలకరి జల్లులు

ఇన్నాళ్లకు గుర్తొచ్చానా.. వాన..

జిల్లాలో పలుచోట్ల మంగళవారం తొలకరి వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించిన సుమారు వారం రోజుల తర్వాత వర్షాలు పడటంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఇప్పటి వరకూ ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరైన జనం ప్రస్తుత వర్షానికి ఉపశమనం పొందారు. జిల్లాలోని పోలవరం, పెదపాడు, పెదవేగి, దెందులూరు తదితర మండలాల్లో తొలకరి జల్లులు కురిశాయి.


అలేఖ్యను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

యూనివర్సిటీ స్థాయిలో అలేఖ్యకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - కామవరపుకోట

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి వాకా అలేఖ్య నన్నయ యూనివర్సిటీ స్థాయిలో ఈ నెల 14వ తేదీన విడుదల చేసిన ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రబాబు, అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి సాయిన కనకరాజు ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఆడమిల్లి సర్పంచి జి.కేశవరావు, అభివృద్ధి కమిటీ మెంబెర్ మధు కలిసి విద్యార్థి అలేఖ్యకు చిరు సత్కారం చేశారు. అనంతరం అలేఖ్యను అభినందిస్తూ ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు రూ.రెండు వేలు, సొసైటీ ఛైర్మన్ ఎస్.కనకరాజు రూ.4500, ఆడమిల్లి సర్పంచి రూ.రెండు వేలు మొత్తం రూ.8500 అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు సురేష్, అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, ధారావతు మల్లేష్, వి.శ్రీనివాస్, ఎ.హర్షవర్ధిని, ఆఫీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు, రేపు పశ్చిమలో కేంద్ర మంత్రి పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి భారతి ప్రవీణ్ పవార్ ఈ నెల 21, 22 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచార శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం భీమవరంలో, గురువారం పాలకొల్లులో పర్యటించినట్లు పేర్కొన్నారు. 21న భీమవరం విష్ణు కళాశాల ఆడిటోరియంలో ఉదయం 6 గంటలకు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. 9 :15 నిమిషాలకు విష్ణు కళాశాల ప్రాంగణంలో ఉన్న దేవాలయాన్ని సందర్శించి 9:45 నిమిషాలకు రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తారని తెలిపారు. 10:30 గంటలకు భీమవరం హాస్పిటల్స్‌లో మేధావులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారని, మధ్యాహ్నం 3:15 నిమిషాలకు విష్ణు డెంటల్ కళాశాలలో ఏర్పాటు చేసిన యువ ఓటర్లతో ముఖాముఖిలో పాల్గొనున్నారు. 22వ తేదీ ఉదయం 9:30 నిమిషాలకు భీమవరం విష్ణు కళాశాలలో పాత్రికేయుల సమావేశంలో పాల్గొనున్నారని తెలిపారు. 11 గంటలకు పాలకొల్లు టిడ్కో గృహాలను పరిశీలించి మధ్యాహ్నం 3:30 నిమిషాలకు పాలకొల్లు బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

కాసుల మోజులో రెవెన్యూ అధికారులు..!

చెరువుల అక్రమ తవ్వకాలపై నోరుమెదపని వైనం
సర్వత్రా విమర్శలు


మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

ప్రజాశక్తి - మండవల్లి

కొనుగోలు చేసిన మామిడి రుచి కంటే కొట్టుకొచ్చిన మామిడికి రుచి ఎక్కువ అనేది పాత సామెత. జీతాలు కన్నా పైన వచ్చే ఆదాయమే మిన్న అనే నేటి సామెతను రెవెన్యూ అధికారులు గుర్తు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాల్సిన అధికారులే కాసుల మోజులో ప్రభుత్వ ఆదేశాలకు తిలోదకాలు ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం చెరువుల తవ్వకాలకు అనుమతులు నిలుపుదల చేసినా రెవెన్యూ అధికారులు మాత్రం చెరువుల తవ్వకాలకు సహకరిస్తున్నారంటే అధికారులకు జీతం కన్నా పైన వచ్చే ఆదాయంపై ఉన్న మోజును తేటతెల్లం చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలనే బేఖాతరు చేస్తూ బడా బాబులకు చెరువులు తవ్వుకునేలా సహకరిస్తున్నారంటే అధికారులకు అధిక సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారనడానికి ఎటువంటి సందేహం లేదనేది తెలియవస్తుంది. దీనికి నిదర్శనమే గన్నవరంలో కోలాహలంగా చేపట్టిన చెరువు తవ్వకాల జాతర.

గ్రామస్తులు, ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరంలోని పచ్చని పంట పొలాలపై బడా బాబు కన్ను పడింది. పొలాలను చెరువులుగా తవ్వేస్తే మరింత సంపాదించుకోవచ్చనే నిర్ణయానికి వచ్చేశాడు. అయితే చెరువు తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు నిలుపుదల చేయడంతో సందిగ్ధంలో పడ్డాడు. గుట్టుచప్పుడు కాకుండా చెరువు తవ్వకాలను చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. చెరువుల తవ్వకాలను అడ్డుకోకుండా ఉండేవిధంగా మధ్యవర్తి సహాయంతో రెవెన్యూ అధికారులతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. రెవెన్యూ అధికారుల అండదండాలతో భారీస్థాయిలో యంత్రాలను ఏర్పాటు చేసి పట్టపగలే ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టాడు. ఇదీలా ఉంటే మరో వ్యక్తి సందిట్లో సడేమియా అనుకుంటూ గన్నవరం కలవపూడి రహదారి పక్కనే సుమారు రెండు ఎకరాల పంట పొలాన్ని సుమారు ఐదు అడుగుల మేర మట్టితో నింపేసి అనుమతులు లేకుండా వెంచర్‌ను ఏర్పాటు చేసేశాడు. అయినప్పటికీ కనీసం ప్రశ్నించేందుకు కూడా రెవెన్యూ అధికారులు అటు దిశగా కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో కాసుల మీకు కష్టాలు మాకా అంటూ ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికే అనుమతులు లేకుండా చెరువులను తవ్వేసి రొయ్యలు సాగు చేయడం వల్ల పర్యావరణం పాడైపోవడంతో పాటు ప్రజలకు తాగునీరు అందని పరిస్థితి. దీంతో పాటు పశువులకు పశుగ్రాసం దొరకక పాడి పైనే ఆధారపడి జీవించే ప్రజలు పశువులను పోషించలేని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా పశువులు గర్భం దాల్చడంలేదని, అందువల్ల రానున్న రోజుల్లో పశువులు కూడా కనుమరుగైపోయే పరిస్థితులు నెలకొన్నాయని పశు పోషకులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టిన చెరువు తవ్వకాలను నిలుపుదల చేసి ప్రభుత్వ ఆదేశాలను కూడా అమలు చేయాలని, ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకొని పశు సంపదను కాపాడాలని వారు కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా గన్నవరంలో చేపట్టిన కొత్త చెరువుల తవ్వకాలను నిలుపుదల చేశామన్నారు. చెరువులు తవ్వుకునేందుకు ఉన్న అనుమతులను కార్యాలయానికి సమర్పించాల్సిందిగా తెలిపామని చెప్పారు.


మట్టి తోలుతున్న ట్రాక్టర్లు

నీట్ విజేతకు లయన్స్ క్లబ్ సత్కారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆలిండియా స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో జాతీయస్థాయిలో 115వ ర్యాంకు సాధించిన విద్యార్థిని గంట హేమ వైష్ణవిని లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ పంతగాని వెంకన్న మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో 720 మార్కులకు 705 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 115వ ర్యాంకు సాధించిన హేమ వైష్ణవి జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలవాలంటే క్రమశిక్షణతో, పట్టుదలతో కష్టపడాలన్నారు. నీట్ విజేత హేమ వైష్ణవి తండ్రి భాస్కరరావు లయన్స్ క్లబ్ సభ్యులు కావడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా నీట్ విజేత వైష్ణవితో పాటు ఆమె తల్లిదండ్రులను కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు భవిరిశెట్టి మురళి, నంబూరు రామచంద్రరాజు, కొండపల్లి పండు, నాయకులు అట్లూరి సురేష్, మద్దిపాటి నాగేశ్వరరావు, ఉక్కుర్తి సీతారాం, దాసరి శేషుకుమార్, రాజాన పండు, నంగులూరి జగత్ కుమార్ పాల్గొన్నారు.



హేమవైష్ణవిని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

అంబరుపేటలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు నియోజకవర్గంలో ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో 171వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు వాసుబాబు భీమడోలు మండలం అంబరు పేట గ్రామపంచాయతీ పరిధిలోని కొండ్రెడ్డి నగర్ ఆవాస ప్రాంతంలో పర్యటించారు. పర్యటనకు వచ్చిన ఎంఎల్ఎకు స్థానికులు హారతులతో స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లిన ఆయన స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మీదీపిక, ఎంపిటిసి సభ్యులు షేక్ ఆజాం, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, ఎఎంసి ఛైర్మన్, ఇంజేటి నీలిమ జూనియర్‌తో పాటు పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

ఏలూరు ఎంఇఒగా రంగయ్య

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు మండల నూతన విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆర్.రంగయ్యను యుటిఎఫ్ ఏలూరు మండల శాఖ నాయకులు ఎంఇఒ కార్యాలయంలో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ రంగయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయులు హక్కులతో పాటు బాధ్యతలు కూడా రెండు కళ్లుగా చూడాలన్నారు. పిల్లలందరినీ బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయటానికి అందరం కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు మాట్లాడుతూ ఎంఇఒకు అన్ని రకాలుగా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఏలూరు మండల శాఖ పాటూరి సురేష్ బాబు, పంపన శ్రీనివాస్ కుమార్, నాయకులు టి.మేషయ్య, ఎల్.కనకదుర్గ, వహీదా బేగం, పూరాఖన్, బి.ప్రభాకర్, కృష్ణ, వెంకటేశ్వరరావు, మునీర్ బాషా, రామకృష్ణ పాల్గొన్నారు.

నూజివీడు ఎంఇఒ-2గా జమలయ్య

నూజివీడు రూరల్ : నూజివీడు ఎంఇఒ-2గా సంగేపు జమలయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గంపలగూడెం హైస్కూలులో పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతి పొందారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంఇఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు విజయవాడకు బదిలీ అయ్యారు. నూతన ఎంఇఒను పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భీమడోలు ఎంఇఒ-2గా భాస్కరకుమార్

భీమడోలు : భీమడోలు విద్యాధికారి-2గా ఎవిఎస్ఎన్.భాస్కర కుమార్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ భీమడోలుకు సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చారు. దీనికి అదనంగా సమగ్ర శిక్ష ఏలూరు అదనపు పర్యవేక్షణ అధికారి(ఎఎంఒ)గా పనిచేసేవారు. ప్రస్తుతం భీమడోలు విద్యాధికారి-2తో పాటు ఎఎంఒగా సైతం కొనసాగనున్నారు. బాధ్యతలను స్వీకరించిన భీమడోలు విద్యాధికారి-2 మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన వివిధ పథకాల అమలు ద్వారా పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన భీమడోలు విద్యాధికారి-2ను మండల రిసోర్స్ పర్సన్లు సత్యప్రసాద్, రమణ, రాధాకృష్ణతో పాటు కంప్యూటర్ ఆపరేటర్ సుమలత అభినందించారు.

కౌలు కార్డు తప్పనిసరి

ప్రజాశక్తి - ముసునూరు

కౌలు రైతు తప్పనిసరిగా కౌలు కార్డు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ చెప్పారు. మండలంలోని చక్కపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద కౌలు రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమోహన్ మాట్లాడుతూ పంట సాగుదారు హక్కుపత్రం (కౌలు కార్డు) కోసం కౌలు రైతు ఆధార్‌కార్డు, భూ యాజమాని పట్టాదారు జిరాక్స్ విఆర్ఒకి అందించాలని తెలిపారు.

అమర్నాథ్ కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - చాట్రాయి

అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని మండలంలోని చనుబండ సెంటర్లో చాట్రాయి మండల గౌడ సంఘం నాయకులు, మాజీ ఎంపిపి కందుల కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కందుల కృష్ణ మాట్లాడుతూ బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలేనికి చెందిన పదో తరగతి చదువుతున్న ఉప్పల అమర్నాథ్ గౌడ్‌ను వ్యక్తిగత కక్షతో పెట్రోల్ పోసి అతి కిరాతకంగా, దారుణంగా నిప్పంటించి హత్య చేసిన వెంకటేశ్వర్‌రెడ్డిని అతనికి సహకరించిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి మండలంలోని గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నూజివీడులో నాగేశ్వరరావు వర్ధంతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నందిగం నాగేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం స్థానిక సుందరయ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, టౌన్ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, సిపిఎం నాయకులు దుర్గారావు, శోభనాద్రి, మరియదాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. క్లబ్ నూతన అధ్యక్షుడిగా కన్నం హనుమంతరావు, కార్యదర్శిగా కొండపల్లి పండు, కోశాధికారిగా కాకర్ల వీరభద్రరావు ఎన్నికయ్యారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా పంతగాని వెంకన్న వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అట్లూరి సురేష్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని అభినందించారు. జోన్ ఛైర్మన్ పంతగాని వెంకన్న, డీసీలు మద్దిపాటి నాగేశ్వరరావు, అట్లూరి సురేష్, ఉక్కుర్తి సీతారాములు మాట్లాడుతూ సేవా రంగంలో అంతర్జాతీయంగా లయన్స్ క్లబ్‌కు విశిష్ట స్థానం ఉందన్నారు. ఆపన్నులకు అభయ హస్తం అందించేందుకు లయన్ సేవా తత్పరులు ఎల్లవేళలా ముందంజలో ఉంటారన్నారు. నూతన కార్యవర్గం సమాజానికి అవసరమైన సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడు భవిరిశెట్టి మురళి, కార్యదర్శి నంబూరి రామచంద్రరాజు, కోశాధికారి కొండపల్లి పండు, నాయకులు దాసరి శేషుకుమార్, నంగులూరి జగత్‌కుమార్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నీటితొట్టెలో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని మైసన్నగూడెంకు చెందిన వామిశెట్టి గోపి, రాశి వీరి కుమార్తె పూజితతో కలిసి శ్రీనివాసపురంలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో పూజిత ఆడుకుంటూ ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి తొట్టెలో పడిపోయింది. నీటితొట్టెలో పడిన పూజితను ఎవరూ గుర్తించలేకపోయారు. దీంతో ఊపిరాడక తొట్టెలోనే పూజిత మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పూజిత(2) మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. గోపి, రాశి దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా మృతి చెందిన పూజిత రెండో కుమార్తె. ముద్దు ముద్దు మాటలతో మురిపించే పూజితకు నూరేళ్లు నిండిపోయాయని తల్లి దండ్రులు చేస్తున్న రోదన పలువురిని కంటతడి పెట్టించింది.

24 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నుంచి కాకినాడకు అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యం జంగారెడ్డిగూడెం బైపాస్‌లో సివిల్ సప్లై డిఎస్ఒ పట్టుకున్నారు. ఖమ్మంకి చెందిన ఆత్మకూరు జగదీష్ మండలంలోని పరిసర ప్రాంతాల నుంచి బియ్యం సేకరించి కాకినాడ తరలిస్తుండగా వేగవరం వద్ద సివిల్ సప్లయ్ అదికారి రుద్రరాజు సత్యనారయణ రాజు సిబ్బంది పట్టుకున్నారు. 480 బస్తాల్లో 24 టన్నుల రేషన్ బియ్యం, లారీ అదుపులోకి తీసుకున్నారు. ఆత్మకూరి జగదీష్, లారీ డ్రైవర్, ఓనర్ షేక్ నాగూర్ మీరాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండల పరిధిలో రూరల్ పోలీసులు జరిపిన దాడుల్లో అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని సుంకొల్లు, దేవరకుంట గ్రామాల్లో నాటు సారా తయారు చేస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రావిచర్ల గ్రామంలో అక్రమంగా 19 మద్యం సీసాలు కలిగిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

'ఎన్ఆర్ఐ'లో అత్యుత్తమ విద్యాబోధన

సిఇఒ తులసీరాం



ప్రజాశక్తి - ఏలూరు

ఆధునిక వసతులతో విశాలమైన తరగతి గదులతో తమ ఎన్‌ఆర్‌ఐ విద్యావిధానం నగుస్తుందని ఆ విద్యాసంస్థ సిఇఒ తులసీరాం అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఏలూరు ఎన్ఆర్.పేటలో జూనియర్ కాలేజీ స్థాపించి అప్పటి నుంచి ఎంతో మంది విద్యార్థులను విజేతలుగా నిలిపి వివిధ హోదాల్లో నిలిచేలా చేశామని చెప్పారు. అలాగే ఈ విద్యాసంస్థకు సంబంధించి అనుబంధంగా జెఇఇ మెయిన్స్, మెడికల్, ఇఎపిసెట్ వంటి కోచింగ్‌లో ఎన్నో విజయాలు చేకూర్చుకున్నామని తెలిపారు. విశేష అనుభవం కలిగిన అమెరిక ఎన్ఆర్ఐ డాక్టర్ల ప్రత్యేక్ష పర్యవేక్షణలో స్పెషల్ ప్రోగ్రామ్స్ రూపొందిస్తున్నామని, ఐఐటి మెడికల్‌కి సంబంధించి సెక్షన్‌కి కేవలం 40 మంది విద్యార్థులతో మ్యాథ్స్ మూడు గంటలు, ఫిజిక్స్ రెండు, కెమిస్ట్రీ రెండు, బొటనీ గంటన్నర, జువాలజీ గంటన్నర టీచింగ్‌తో పాపాటు అదే అధ్యాపకులతో ప్రతి సబ్జెక్టుకు ఒక గంట కౌన్సిలింగ్ క్లాసులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమగ్ర విశ్లేషణలతో కలర్ పేజీల్లో ఆకర్షణీయంగా రూపొందించిన సరికొత్త స్టడీ మెటీరియల్, క్వశ్చిన్‌బ్యాంక్, 20 సంవత్సరాలకుపైగా కోచింగ్ అనుభవం కలిగిన అధ్యాపకుల బృందం, ప్రతివారం రెండు అబ్జెక్టివ్ పరీక్షల నిర్వహణ అనంతరం పేపర్ డిస్కషన్, సిఇఒతో రిజల్ట్ అనాలసిస్ చేయిస్తూ విద్యార్థుల పురోగతికి సూచనలు, ప్రతి నెలా ఐపిఇ మోడల్‌లో యూనిట్ టెస్ట్ పరీక్షల నిర్వహణ, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌లో అసైన్‌మెంట్, అబ్జెక్టివ్ పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్ పరీక్షలకు ప్రాక్టీస్ చేయిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి పురోగతిని బట్టి తల్లిదండ్రులతో అకాడమిక్ డీన్ ఇంటరాక్షన్ ఉంటుందని తెలిపారు. ఇఎపిసెట్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎంసెట్, ఇఎపిసెట్ కోచింగ్ ఇచ్చేందుకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సెక్షన్‌కి కేవలం 60 మంది విద్యార్థులతో ప్రారంభ నుంచి ఇంటర్ బోర్డు సిలబస్‌తో పాటు సమంతరంగా రెండు రాష్ట్రాల సిలబస్ పూర్తి చేసేవిధంగా ఎంసెట్, ఇఎపిసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి సోమవారం ఎంసెట్ మోడల్ అబ్జెక్టివ్ పరీక్ష, ప్రతి బుధవారం లాంగ్వేజీ సబ్జెక్టులపై పరీక్ష, పాఠాలు చెప్పే అధ్యాపకులతో విద్యార్థుల ప్రగతి పూర్తి బాధ్యతలు అప్పజెప్పడం వంటివి ప్రత్యేకతలుగా చెప్పారు.



ప్రాక్టీకల్స్ చేస్తున్న విద్యార్థినులు

కొత్తపల్లిలో వెలిగిన వీధిదీపాలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు మండలంలోని కొత్తపల్లిలో వీధిదీపాలు మంగళవారం రాత్రి వెలిగాయి. కొత్తపల్లి దళితవాడ అంగన్‌వాడీ కేంద్రం బజారులో గత మూడు నెలలుగా వీధిదీపాలు మరమ్మతులకు గురై వెలగడంలేదు. దీంతో రాత్రి సమయాల్లో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై వీధిదీపాలు వెలిగించండి మహాప్రభో అనే శీర్షికతో మంగళవారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీనిపై స్పందించిన గ్రామ కార్యదర్శి జి.రమేష్ వెంటనే పాడైన వీధిదీపాలు స్థానంలో కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామ వైసిపి నేత దాకరపు శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

'స్టార్ డెంటల్ ఎక్స్‌పర్ట్స్ ఆధ్వర్యాన ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు స్టార్ డెంటల్ ఎక్స్‌పర్ట్స్ వారు గోపన్నపాలెంలోని ఎస్ఎస్ఆర్ గవర్నమెంట్ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టార్ డెంటల్ డాక్టర్ ఎస్.శ్రీహర్ష నిర్వహించారు. కాలేజీలోని 200 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా టూత్ పేస్టులు, అవసరమైనవారికి మౌత్ లోషన్‌లు, మందులు పంపిణీ చేసి దంత సంరక్షణను వివరించారు. దీనిలో స్టార్ డెంటల్ డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ జ్యోత్స్న, హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గణేష్‌బాబు, సెక్రటరీ శ్రీరామ్మూర్తి, కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియేల్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ కోర్సులకు 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు తెలిపారు. బిఎస్‌సి కంప్యూటర్స్ మెయిన్, మ్యాథ్స్ మైనర్, బిఎస్‌సి జీవశాస్త్రం మెయిన్స్ వృక్షశాస్త్రం మైనర్‌గా, బిఎ ఎకనామిక్స్ మేజర్ హిస్టరీ మైనర్, బికాం జనరల్‌తో పాటు కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2023 -24 విద్యా సంవత్సరంలో డిగ్రీ అడ్మిషన్ పొందే విద్యార్థులకు కళాశాల సిబ్బంది సహకారంతో ఉచితంగా రెండు జతలు యూనిఫాంతో పాటు ఉచిత బస్సుపాస్ విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధురాలిని ఇంటికి చేర్చిన మహిళా పోలీసు

ప్రజాశక్తి - కైకలూరు

మతిస్థిమితం కోల్పోయిన వృద్ధురాలిని వాలంటీర్, మహిళా పోలీసు ఆమె సభ్యులకు అప్పగించారు. స్థానిక వైఎస్ఆర్ కాలనీలో సుగుణమ్మ అనే వృద్ధురాలు దారి తెలియక తిరుగుతుండగా వాలంటీర్ అగోల్లు నాగమణి ఆమెను గుర్తించి వివరాలు అడిగింది. ఆమె వివరాలు చెప్పలేకపోవడంతో మహిళ పోలీస్ చుండూరి ఉమసాయి సిఐ రఘు సహకారంతో ఆ వృద్ధురాలి ఫొటోలను గ్రూపుల్లో పెట్టారు. సోమేశ్వరంలో కుమార్తె, శ్రీపర్రులో కుమారుడు ఉన్నట్లు గుర్తించి ఆయా గ్రామాల మహిళ పోలీస్ సహకారంతో సుగుణమ్మను వారి వద్దకు చేర్చారు. సుగుణమ్మ ఆచూకీ కనుక్కొని పిల్లల వద్దకు చేర్చినందుకు వాలంటీర్ నాగమణి, మహిళా పోలీస్ ఉమసాయిలను కైకలూరు పోలీసులు అభినందించారు.

అభివృద్ధి పనులకు ప్రణాళికలు

ప్రజాశక్తి - చింతలపూడి

నగర పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులపై నగరపంచాయతీ అధికారులతో ఆయన మంగళవారం చర్చించారు. చింతలపూడి నగర పంచాయతీ సెంట్రల్ లైటింగ్, మినీబస్టాండ్, మినీ పార్కింగ్ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు మొదలు పెడతామని తెలిపారు. పాతబస్టాండ్ వద్ద పనులు వచ్చే వారం నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు పాల్గొన్నారు.

గోవులను అక్రమంగా తరలిస్తే చర్యలు

నూజివీడు రూరల్ : ఆవులను అక్రమంగా తరలించే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని, అటువంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పది వాహనాల్లో 500 గోవులను గో సంరక్షణ శాఖకు పంపినట్లు ఆయన తెలిపారు. అడ్డుకున్న వారిపై మూడు కేసులు నమోదు చేశామని, దీనికి సంబంధించి ఎటువంటి సమాచారమైన పోలీసులకు అందించాలని కోరారు.

విద్యకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని మర్రిగూడెంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసిన అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరుశాతం విద్యార్థులు జగనన్న గోరు ముద్ద తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రణాళికాబద్దంగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి, ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఆలీ, విద్యాకమిటీ ఛైర్మన్ పరసా శ్రీను పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందిపుచ్చుకుని ఆరోగ్యంగా ఉండాలని మండవల్లి సర్పంచి మెండ ఝాన్సీ కోరారు. స్టేషన్ సెంటర్‌లోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు పుష్టికరమైన పౌష్టికాహారం అందుతుందన్నారు. అంతే కాకుండా ఆటపాటలతో కూడిన చక్కని విద్యతోపాటు మంచి క్రమశిక్షణ మంచి అలవాట్లు అలవాడతాయని ఆమె తెలిపారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన ఆయాను తల్లులకు పరిచయం చేసి అనంతరం అంగన్వాడీ ద్వారా వచ్చిన పాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సరస్వతి, మెండ సురేష్, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షునిగా కోన శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) రాష్ట్ర అధ్యక్షులుగా కోన శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు మహాసభ గ్లోబల్ అధ్యక్షులు తంగులురి రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు టిజి.వెంకటేష్ నియామక పత్రాన్ని అందించారు. శ్రీనివాస్ ఆధ్వర్యంలో వామ్ ఆంధ్రప్రదేశ్ నలుమూలలలో విస్తరించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో మరెంతో గుర్తింపు తేవాలని కోరారు. ప్రతి జిల్లాలోనూ ప్రతి మండలంలోని సమర్ధవంతమైన కార్యవర్గాలను ఏర్పాటు చేసి ఆర్యవైశ్యులకు అతి చేరువలోకి వామ్‌ను తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తానని కోనా శ్రీనివాసరావు తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న కోన శ్రీనివాసరావు

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. ప్రాజెక్టు సత్వర నిర్మాణం కోసం పోరుబాట పట్టిన సిపిఐ జీపు యాత్ర మంగళవారం పోలవరం మండలానికి చేరుకుంది. మండలంలో ఉన్న పునరావాస గ్రామాల్లో నిర్వాసితులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ నిర్వాసిత గ్రామాలన్నీ సమస్యలతో నిండిపోయాయని తెలిపారు. మౌలిక వసతులు ఏ పునరావాస గ్రామానికి కల్పించకపోవడం శోచనీయమన్నారు. శ్మశానవాటికలు లేకపోవడం ఉన్నవాటికి సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. సిపిఐ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేంత వరకు నిరంతరం పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. నిర్వాసితుల సమస్యలపై ఈ నెల 26వ తేదీ పోలవరంలో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ జీపు యాత్రలో పోలవరం, కొయ్యలగూడెం మండల కార్యదర్శులు జల్లేపల్లి వెంకట నరసింహారావు(జెవి), జమ్మి శ్రీనివాస్, పోలవరం పట్టణ కార్యదర్శి జల్లేపల్లి వేణుగోపాలకృష్ణ, నిర్వాసితులు గౌరి, కృష్ణ, తాలూరి శ్రీను, రాపాక కృష్ణంరాజు, వార యేసు, రాపాక గోపి పాల్గొన్నారు.

ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో రెండు రోజులపాటు జరగనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) రాష్ట్ర కమిటీ సమావేశాలు ఏలూరు రామకోటి (పేరయ్య కోనేరు) సమీపంలోని రైస్‌మిల్లర్ అసోసియేషన్ హాలులో మంగళవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి వివిధ జిల్లాల నుంచి సభ్యులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సమావేశంలో చర్చించారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం తదితర స్కీం వర్కర్ల సమస్యలు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, హమాలీ, మోటార్ తదితర అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు తదితర అనేక అంశాలను ఈ సమావేశాల్లో చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన భవిష్యత్తు ఆందోళన కార్యక్రమాలను ఈ సమావేశాల్లో రూపొందించారు. ఇప్పటి రాష్ట్ర, ఆలిండియా మహాసభలు జరిగిన తీరు తెన్నులను కూడా సమీక్షించి, చివరిగా కార్మిక వర్గ సమస్యలపై కొన్ని నిర్ణయాలను, భవిష్యత్తు కర్తవ్యాలను కూడా రూపొందించుకోనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, జె.వెంకటేశ్వర్లు, ఆర్.హరికృష్ణ, సహాయ కార్యదర్శులు యు.వెంకటేశ్వరరావు(యువి), జి.భారతి, డి.గణేష్, కోశాధికారి కెవి.రమణ వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర కమిటీలోకి ఎన్నికైన సభ్యులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

మండవల్లి : యువత దుర అలవాట్లకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవడంతో పాటు తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని నీ తోడు మానసిక వికాస కేంద్రం (ఎన్‌ఐసిసి) డాన్ బాస్కో నవజీవన్ బాల భవన్ కోఆర్డినేటర్ టి.లీలావతి అన్నారు. జూన్ 26 అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని భైరవపట్నంలో ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, నేటి యువత చిన్నతనం నుంచి మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. చెడు అలవాట్లకు బానిసై నేరాలకు పాల్పడిన వారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు రౌడీ షీట్లను కూడా తెరుస్తున్నారని వివరించారు. ఇటువంటి శిక్షలు పడితే భవిష్యత్తులో పైచదువులు చదువుకోడానికి ఉద్యోగాలకు అవకాశం ఉండదని చెప్పారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే మత్తు పానీయాలు, చెడు వ్యసనాలపై అవగాహన కలిగి దూరంగా ఉంటూ విద్యలో రాణించి తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్ట తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు జి.సముద్రుడు, కె.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

22న పశు బీమా పథకంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - భీమడోలు

స్థానిక వెలుగు కార్యాలయం వేదికగా ఈ నెల 22వ తేదీన భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు మండలాల స్థాయిలో పశు బీమా పథకంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు భీమడోలు ప్రాంతీయ పశు వైద్య సేవ సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.నెహ్రూబాబు, ఉప సంచాలకులు డాక్టర్ ఎ.రామచంద్రరావు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా భీమడోలులో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో అమలు చేసిన పశు నష్టపరిహారం పథకం స్థానంలో పశు బీమా పథకాన్ని నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. దీనివల్ల పాడి రైతులకు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. బీమా ప్రీమియం చెల్లింపులో ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతులతో పాటు దారిద్ర రేఖకు దిగువన ఉన్నవారికి రాయితీ ఉంటుందన్నారు. ప్రీమియం చెల్లించిన వారికి మూడు సంవత్సరాల పాటు బీమా రక్షణ ఉంటుందన్నారు. వేసవి పూర్తయిన నేపథ్యంలో ప్రస్తుత సీజన్‌లో పశువులకు గొంతు వాపు, జబ్బవాపు, గొర్రెలకు చిటికల వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. వీటి నుంచి రక్షణ కోసం పశు వైద్యశాల వద్ద మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పూళ్ల పశు వైద్యులు హరికృష్ణ పాల్గొన్నారు.

జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జ్వరాల పట్ల అశ్రద్ధ చూపరాదని, జ్వరం వచ్చినట్లు అనుమానం కలిగితే వైద్యాధికారిని లేక వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఏలూరు కొత్తపేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్వప్న సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక కొత్తపేట చేపలు తూము సెంటర్‌లో ప్రజలకు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ మలేరియా జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్తపేట, చేపల తూము సెంటర్లో వైద్య సిబ్బందితో కలిసి ప్రజలకు మలేరియా జ్వరాల పట్ల అవగాహన కల్పించారు. ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా అందిస్తారని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, రమేష్, ఎఎన్ఎంలు దుర్గ, వెంకటలక్ష్మి, రమాదేవి, భారతి, ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు సిహెచ్.దేవి, పి.దేవి, సుమలత సుబ్రహ్మణ్యేశ్వరి, అనురాధ, మణి, చిట్టమ్మ యుపిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాతల త్యాగం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోే

రక్తదాతల కొరత తీవ్రంగా ఉండే వేసవి కాలంలో సైతం రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన రక్తదాతల త్యాగం అభినందనీయమని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం రక్త నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జి మత్తు వైద్య నిపుణులు డాక్టర్ వి.రవిపాల్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వేదికగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలు కోర్టుకు చెందిన న్యాయవాదులు, దాతలతో పాటు భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా రక్త నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జి మాట్లాడుతూ రక్తదాన శిబిరాల ద్వారా తాము సేకరించిన రక్తాన్ని ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వివిధ పరీక్షల అనంతరం శుద్ధి చేస్తామన్నారు. అవసరాల మేరకు శుద్ధి చేసిన రక్తాన్ని వివిధ రూపాల్లో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తెస్తామన్నారు. దీనికి అదనంగా భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న అదనపు సౌకర్యాలతో రక్తాన్ని మరిన్ని విభాగాలుగా విభజించి అవసరమైన వారికి ప్రభుత్వ వైద్యుల సిఫార్సు మేరకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఒకరు చేసిన రక్తదానంతో ఆపదలో ఉన్న పదిమందికి వివిధ రూపాలుగా విభజించిన రక్తాన్ని అందించడం ద్వారా రక్తదాతలు వారి ప్రాణాలను కాపాడిన వారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆల్బర్ట్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రష్మీ, ల్యాబ్ టెక్నీషియన్ పాపారావు, అనీల్, రక్త నిల్వ కేంద్ర సిబ్బంది పాపారావు, పరమేష్ పాల్గొన్నారు.

బిసిలకు వైసిపి చేసింది శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకొచ్చాక బిసిలకు చేసిందేమీ లేదని టిడిపి రాష్ట్ర సగర సాధికారక కన్వీనర్ జంపిన శ్రీనివాసరావు విమర్శించారు. మండల కేంద్రమైన ముసునూరు రైస్ మిల్లు సెంటర్ వద్ద బిసిల భరోసా బాట కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కడమే తప్ప చేసిన అభివృద్ధి ఏం లేదన్నారు. నాలుగేళ్ల పాలనలో టిడిపి నాయకులపై కక్ష పూరిత పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గజ్జల గణేష్, సర్పంచులు కొండేటి విజయలక్ష్మి బాబి, టి.రాధిక సత్యనారాయణ, ఉపసర్పంచి తోట శ్రీనివాసరావు, టిడిపి నియోజకవర్గ క్లస్టర్ గారపాటి నరసింహారావు, సగర సాధికర సభ్యుడు నక్కా యోహెన్, మాజీ చక్కపల్లి ఉపసర్పంచి కాటేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ చట్టం కింద చేసిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడి రాము పాల్గొని సామాజిక తనిఖీల్లో చోటుచేసుకున్న అవకతవకలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి శ్రీదేవి, ఎస్ఆర్‌పి రామచంద్ర, ఎంపిడిఒ విజయ్‌కుమార్, ఎపిఒ సోమేశ్వరి పాల్గొన్నారు.